క్లుప్తంగా

మీకోసం వెబ్‌సైట్‌లో అర్జీల వివరాలు

● కలెక్టర్ డా.ఎస్ ప్రభాకరరెడ్డి



పార్వతీపురం రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల వివరాలను మీ కోసం వెబ్‌సైట్‌లో నమోదు చేయవచ్చునని కలెక్టర్ డా.ఎస్. ప్రభాకరరెడ్డి తెలిపారు. అలాగే ప్రతి రోజూ ప్రజలు తమ సమస్యల వినతులను అందజేసేందుకు కలెక్టరేట్‌లో ఉన్న గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి పీజీ ఆర్ఎస్ సెల్‌ను నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. అంతేకాకుండా ప్రతి సోమవారం కలెక్టరేట్‌తో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలు ఫిర్యాదులపై అర్జీలు అందజేయవచ్చన్నారు. అలాగే వచ్చిన అర్జీల వివరాలను టోల్‌ఫ్రీ నంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని సూచించారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ

సాలూరు: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్ ద్వారా డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ త్వరలో ప్రారంభించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత శిక్షణ తరగతుల్లో పాల్గొనాలనుకునే అర్హులైన అభ్యర్థులు కళాశాలలోని స్కిల్‌హబ్ సెంటర్ వద్ద వివరాలు తెలుసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 7382559022 నంబరును సంప్రదించాలని సూచించారు. సాలూరు, పరిసర ప్రాంతాల యువత ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోస్టల్ శాఖ ప్రత్యేక ఆధార్ క్యాంపులు



బాబూరావు

బలిజిపేట: పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల13, 14తేదీలలో బలిజిపేట మండలంలోని తుమరాడలో గల శ్రీభారతి హైస్కూల్‌లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు పార్వతీపురం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్.బాబూరావు తెలిపారు. 5నుంచి 15సంవత్సరాల లోపు వయస్సు కలిగిన పిల్లల మాన్డేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్ ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. కొత్త ఆధార్ కావాలన్నా, ఆధార్‌కు సంబంధించిన అన్ని సర్వీసులు చేయనున్నట్లు చెప్పారు. రెండు రోజుల పాటు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు క్యాంపు నిర్వహించనున్నామన్నారు. దీనికి సంబంధించిన వివరాలు కె.శ్రీనివాసరావు, పోస్టల్ ఇన్‌స్పెక్టర్, బొబ్బిలి డివిజన్ వారు పర్యవేక్షిస్తారన్నారు.

కంటికి కునుకు, పంటకు భద్రత కరువు

● ఏనుగుల సంచారంతో అవస్థలు



కొత్తపట్నం సమీపంలో రోడ్డుపై ఉన్న ఎనిమిది ఏనుగుల గుంపు

పార్వతీపురం రూరల్: మండలంలో గత నెలలో ప్రవేశించిన ఏనుగుల గుంపు రైతన్నలకు, ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేతికొచ్చే పంటకు భద్రత లేకుండా బీభత్సం సృష్టిస్తూ భయాందోళనకు గురిచేస్తున్నాయి. నిన్నటి వరకు లక్ష్మీనారాయణపురం ముదిరాజు చెరువు సమీపంలో పంటలను ధ్వంసం చేస్తూ సంచరించిన 8 ఏనుగుల గుంపు ఆదివారం మండలంలోని కొత్తపట్నం, సంగంవలస గ్రామాల మధ్య జనావాసాలు, రహదారుల సమీపంలో సంచరిస్తూ మరింత భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఎన్నికల మందు మేము అధికారంలోకి వస్తే ఏనుగుల బెడదకు శాశ్వత ముగింపు పలుకుతామంటూ ఊరూరా తిరిగి హామీల వర్షం కురిపించినకూటమి నేతలు తీరా అధికారంలోకి వచ్చాక ఈ సమస్యను పట్టించుకోవడం లేదని ఇచ్చిన మాటలను తుంగలో తొక్కారని, ప్రజల భద్రతను రైతుల కష్టాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యాడని మండలంలోని పలు గ్రామాల రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేతన్నకు ఉచిత విద్యుత్ ఉత్తిదే..!

● నేటికీ అమలు కాని హామీ
● మీనమేషాలు లెక్కిస్తున్న సర్కారు

బలిజిపేట:

నేతన్నకు ఉచిత విద్యుత్ హామీ ఉత్తిదేనని చేనేత కార్మికులు మండిపడుతున్నారు. చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్‌పై కూటమి ప్రభుత్వం జీఓ ఇచ్చి ఆరునెలలు గడుస్తున్నా నేటికి అది అమలు కాకపోవడంపై ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం జీఓ ఇచ్చి చేతులు దులుపుకుంది తప్ప ఉచిత విద్యుత్‌ను అమలు చేయలేదని వాపోతున్నారు. విద్యుత్ చార్జీల బాదుడు తప్పడం లేదని చెబుతున్నారు. ఉచిత విద్యుత్ జీఓతో చేనేత కుటుంబాలకు కొంతైనా ఆర్థిక భారం తగ్గుతుందని భావించిన వారికి నిరాశే మిగిలిందంటున్నారు. చేనేత దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మగ్గాలు నేసే నేతన్నలకు నెలకు 200యూనిట్లు ఉచిత విద్యుత్ అందిస్తామన్నారు. అయినప్పటికీ అది అమలు కాకపోవడంతో నేటికీ విద్యుత్ బిల్లులు వస్తున్నాయన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నేతన్న రాజు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నేతన్న నేస్తం పథకం ద్వారా మగ్గం కలిగిన ప్రతి నేతన్నకు ఏడాదికి రూ. 24 వేల ఆర్థిక సాయం అందించింది. అంతేకాకుండా విద్యుత్ చార్జీల నుంచి 96 పైసల యూజర్ చార్జీలను తగ్గించి వెసులుబాటు కల్పించింది.

ఎన్నికల ముందు హామీ

గతేడాది జరిగిన రాష్ట్ర సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నాయకుడి హోదాలో చంద్రబాబు పుత్తూరులో పర్యటించి బహిరంగ సభలో మాట్లాడుతూ చేనేత, పవర్‌లూమ్స్ కార్మికులకు 500 యూనిట్లు కరెంట్ ఉచితంగా ఇస్తామంటూ హామీ ఇచ్చారని చేనేత కార్మికులు గుర్తు చేస్తున్నారు. ఆ హామీని గుడ్డిగా నమ్మిన నేత కార్మికులు కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపిస్తే అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మాత్రం నాటి ఎన్నికల హామీకి ఎగనామం పెట్టడంతో కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



విద్యుత్ బిల్లులు చూపుతున్న చేనేత కార్మికులు



మగ్గం నేస్తున్న నేతన్న

జీవో అమలులో నిర్లక్ష్యం

అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఒత్తిడితో ఈ ఏడాది మార్చి 26న జీవో 44ను విడుదల చేసింది. దీనిలో చేనేత కుటుంబాలకు నెలకు 200యూనిట్లు, పవర్‌లూమ్ యూనిట్లకు నెలకు 500యూనిట్ల ఉచిత విద్యుత్ అందించనున్నట్లు జీవోలో స్పష్టం చేశారని చేనేత కార్మికులు తెలిపారు. అయినప్పటికీ కూటమి ప్రభుత్వం ఆ జీఓలను ఇప్పటికీ అమలు చేయకపోవడం దారుణంగా ఉందని ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో మగ్గాలతో నేత నేసేవారు 200పైచిలుకు కుటుంబాల వరకు ఉన్నారు. ప్రస్తుతం నెలకు కనీసం రూ.500 విద్యుత్ బిల్లు వస్తుంటే మా బాధ పట్టించుకునేవారు లేరని చేనేత కార్మికులు నీలకంఠం, కుమార్, గణేష్, రమణమ్మ తదితరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేనేత కార్మికులకు నెలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇవ్వాలని వారు కోరుతున్నారు.

బిల్లులు కట్టేదెలా



ఉచిత విద్యుత్ లేదు సరికదా, మాకు వస్తున్న విద్యుత్ బిల్లులను కట్టలేకపోతున్నాం. మగ్గం నేస్తేనే మా జీవనం సాగుతుంది. మగ్గం మీద నేతతో కుటుంబాలను పోషించుకునేందుకే కష్టంగా ఉంటే రూ.1000లు దాటి బిల్లులు వస్తుంటే మా పరిస్థితి ఏమిటి. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఉచిత విద్యుత్ ఇచ్చి ఆదుకోవాలి.

–ఎస్.కుమార్, చేనేత కార్మికుడు, నారాయణపురం

గురుకులాల్లో పర్యవేక్షణ కరువు

● ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్

పార్వతీపురం రూరల్: కురుపాం గురుకులంలో పచ్చకామెర్లతో ఇద్దరు విద్యార్థులు మరణించడం, మరో వంద మంది అస్వస్థతకు గురవడం అధికారుల పర్యవేక్షణ లోపానికి, ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముప్పల అమర్నాథ్ సమక్షంలో జరిగిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఈ ఘటనపై ఉపాధ్యాయులు తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అమర్నాథ్ మాట్లాడుతూ గురుకులాల్లో మెనూ సక్రమంగా అమలు చేయకపోవడం వల్లే విద్యార్థుల్లో పోషకాహార లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందన్నారు. పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందని, ఘటనలు జరిగినప్పుడు తూతూ మంత్రంగా చర్యలు తీసుకుని చేతులు దులుపుకోవడం దారుణమని విమర్శించారు. మరణించిన విద్యార్థుల కుటుంబాలకు తక్షణమే రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి తాడంగి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి వసతి గృహానికి ఆరోగ్య కార్యకర్తను నియమించి విద్యార్థులకు నిరంతరం వైద్యపరీక్షలు నిర్వహించాలని కోరారు. ఉపాధ్యాయులు సంఘటితంగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు పైడిరాజు పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ముక్తకంఠంతో కోరారు. పార్వతీపురం మండల పరిధిలోని పద్మ పేరంటాలు గుడి సమీపంలో నిర్వహించిన ఈ సమావేశంలో పలు మండలాల ఉపాధ్యాయులు, ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ ఉపాధ్యాయులు

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి

సీతానగరం: రోడ్డు ప్రమాదాల నివారణకు వాహన చోదకులు సహకరించాలని హెచ్‌సీ తిరుపతిరావు అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలోని జాతీయ రహదారిలో సువర్ణముఖి నది వద్ద ఉన్న వంతెన సమీపంలో ఆదివారం వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరచూ రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనాలు తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. ఇదివరలో వాహనాలపై విధించిన అపరాధ రుసుం చెల్లించాలని కోరారు. అలాగే వాహనాలు ఇంటినుంచి రోడ్డుమీదకు తెచ్చే సమయంలో హెల్మెట్ ధరించాలని, వాహనానికి సంబంధించిన రికార్డులు, లైసెన్స్ విధిగా అందుబాటులో ఉంచాలని సూచించారు. చిన్న పిల్లలకు, అనుభవంలేనివారికి వాహనాలు ఇవ్వడం వల్ల, మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలియజేశారు. రోడ్డు ప్రమాదం జరిగితే సీబుక్ ఉన్న వారిపై కేసు నమోదు చేయనున్నట్లు స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాలు నివారించడానికి వాహన చోదకులు సహకరించాలని కోరారు.



వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు

నకిలీ మద్యంపై ధర్నాను విజయవంతం చేయాలి

సీతానగరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో టీడీపీ నాయకులు నకిలీమద్యం విచ్చలవిడిగా తయారు చేసి విక్రయించడంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతున్నందుకు నిరసనగా పార్వతీపురంలో సోమవారం చేపట్టనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.శ్రీరాములునాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆయన పార్టీ మండల కార్యాలయంలో మండల యూత్‌విభాగం అధ్యక్షుడు దాసరి కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు హాని కలిగించేలా తయారు చేస్తున్న నకిలీ మద్యాన్ని నిర్మూలించి తయారీదారులు, నిర్వాహకులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పార్వతీపురం నియోజకవర్గ వ్యాప్తంగా గల ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, పార్టీ ప్రతినిధులు, ముఖ్య నాయకులందరూ ఈ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పార్టీ సీనియర్ మండల నాయకులు శంకరావు వెంకటరమణ, దండి ధనంజయ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.శ్రీరాములు నాయుడు

రైతు సంఘం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

సీతానగరం: పాలకొండలో ఈ నెల 16వ తేదీన జరగనున్న ఏపీ రైతు సంఘం జిల్లా 3వ మహాసభలను రైతులు, రైతుసంఘం నాయకులు, సానుభూతి పరులు విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు కోరారు. ఈ మేరకు రైతు సంఘం జిల్లా 3వ మహాసభలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన మహాసభల కరపత్రాలను ఆదివారం కాశీపేటలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక రైతు సంఘం ప్రతినిధులకు పోరాట పటిమ ఉందని గుర్తు చేశారు. పలు అంశాలపై పోరాటం చేసి సమస్యలను పరిష్కరించుకోగలిగామని తెలియజేశారు. ఈ మేరకు గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మహా సభలో చర్చించనున్నట్లు తెలిపారు. అలాగే దశాబ్దాల కాలంగా అపరిష్కృతంగా ఉన్న తోటపల్లి, పెద్దగెడ్డ, లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారం విశాఖ స్టీల్‌ప్లాంట్, వంశధార సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయడానికి అధికారులపై ఒత్తిడి తీసుకురానున్నట్లు చెప్పారు. రైతు సంఘం మండల కార్యదర్శి సిరికి శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా స్థాయి రైతుసంఘం మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.

కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా, మండల నాయకులు తేలు ధనుంజయ్, పకీర్‌నాయుడు, పి.విశ్వనాథం, రెడ్డి సత్యనారాయణ, జీవీ రమణ, బి స్వామినాయుడు పాల్గొన్నారు.



రైతు సంఘం జిల్లా మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

రహదారి నిర్మాణం చేపట్టాలని నిరసన

పాచిపెంట: మండలంలోని కేరంగి సెంటర్ నుంచి మిలియాకంచూరు పంచాయతీ కొండమోసురు, ములగపాడు, అల్లంపాడు మీదుగా కొండల దండి, వరకు నూతన రహదారి నిర్మాణం చేపట్టాలని కోరుతూ కొండమోసురు, ములగపాడు, అల్లంపాడు, కొండలదండి తదితర గ్రామాలకు చెందిన గిరిజన ప్రజలు ఆదివారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రహదారి అధ్వానంగా ఉండడంతో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆటోలు కూడా వెళ్లలేని పరిస్థితి ఉందని, అత్యవసర పరిస్థితుల్లో డోలీలు శరణ్యమవుతున్నాయని వాపోయారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఐదు కోట్ల 85లక్షలతో రహదారి మంజూరైందని, ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు జరగలేదన్నారు. తర్వాత వచ్చిన ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి గుమ్మడి సంధ్యారాణి, అధికారులు స్పందించి రహదారి పనులు చేపట్టాలని కోరారు. స్థానిక సర్పంచ్ కిలపర్తి రామయ్య, కేరంగి సర్పంచ్ సోముల లచ్చయ్య గిరిజన గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న గిరిజన గ్రామాల ప్రజలు

గిరిజన ప్రాంతాల్లో పవర్ ప్లాంట్ అనుమతులు రద్దు చేయాలి

● సీపీఎం నాయకుల డిమాండ్

మక్కువ: మండలంలోని దుగ్గేరు గ్రామ సమీపంలో చింత గ్రీన్ ఎనర్జీ సంస్థ ఆధ్వర్యంలో పంప్‌డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్ ఏర్పాటుకోసం ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని, ఆ అనుమతులు రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు విలేకరులతో మాట్లాడుతూ పంప్‌డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ అవసరమైన నీటిని వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు, తోటపల్లి ప్రాజెక్ట్‌ల నుంచి 24 ఎంసీఎం నీటి కేటాయింపులకు మంత్రి మండలిలో ప్రతిపాదనలు చేసినట్టు పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం దుగ్గేరు వద్ద పంప్‌డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్ కోసం వెంగళరాయసాగర్, తోటపల్లి ప్రాజెక్టు ద్వారా వాటర్‌ను కేటాయిస్తున్నట్లు ప్రతిపాదనలు చేయడం అన్యాయమన్నారు. తోటపల్లి, వెంగళరాయసాగర్, జంఝావతి ప్రాజెక్టు పరిధిలో స్థిరీకరించిన ఆయికట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో పంప్‌డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు, గ్రామసభలు నిర్వహించలేదన్నారు. రహస్యంగా సర్వేలు చేసి పంప్‌డ్ స్టోరేజీ పేరుతో గిరిజన ప్రాంతం మొత్తాన్ని కార్పొరేట్ పెట్టుబడుదారులకు అప్పజెప్పడానికి చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ సిద్ధపడ్డారని ఆరోపించారు. స్థానిక మంత్రి గుమ్మడి సంధ్యారాణి సొంత నియోజకవర్గంలో గిరిజనులకు అన్యాయం జరుగుతోందని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎన్.వై.నాయుడు, మండల కమిటీ సభ్యుడు అల్లు ఆదినారాయణ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

చెరకుకు ప్రత్యామ్నాయంగా పామాయిల్

సీతానగరం: ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారం పరిధిలో వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు చెరకు పంటకు ప్రత్యామ్నాయంగా వాణిజ్య పంటగా పామాయిల్ తోటల పెంపకానికి, అంతర్‌పంటల సాగుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. చక్కెర కర్మాగారం పరిధిలో 18 వేల నుంచి 20వేల ఎకరాల విస్తీర్ణంలో చెరకు సాగు చేసేవారు. చక్కెర కర్మాగారం మూతపడడంతో చెరకుసాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. దీంతో వాణిజ్యపంటగా చెరకును ఇంతవరకు ఎంపిక చేసుకుని సాగు చేసిన రైతులు ప్రత్యామ్నాయంగా పామాయిల్ తోటల పెంపకంపై ఆసక్తి చూపుతున్నారు. కేంద్రప్రభుత్వం పామాయిల్ తోటల పెంపకానికి రాయితీలు ఇవ్వడం, రాజాం పట్టణానికి చెందిన శ్రీనివాసా పామాయిల్ మిల్లు యాజమాన్యం బగ్గందొరవలసలో మలేషియా నుంచి కొనుగోలు చేసిన సీడ్‌తో పామాయిల్ మొక్కలు పెంకంచేస్తూ రైతులకు పామాయిల్ మొక్కలు అందుబాటులో ఉంచడంతో చెరకు సాగుభూముల్లో పామాయిల్ తోటల సాగు పెరిగింది. జీవనోపాధికి అంతర్‌పంటగా జొన్న, పెసర, మినుము, పత్తి, కూరగాయలు సాగు చేయడానికి రైతులు కృషి చేస్తున్నారు.



పామాయిల్ ప్లాంటేషన్‌లో మిశ్రమ పంట సాగుకు చదును చేసిన భూమి



బగ్గందొరవలస నర్సరీలో పంపిణీ చేస్తున్న మొక్కలు

రాయితీలతో ఆసక్తి



పామాయిల్ గెలల ధర ఆశాజనకంగా ఉంది.మొక్కలు ఇందుబాటులో ఉన్నాయి. గెలల కొనుగోలు కేంద్రం రైతుల కోరిన ప్రాంతంలోనే ఏర్పాటవుతోంది. పంట కోతకు వచ్చే వరకు మిశ్రమ పంట సాగు చేయడానికి అవసరమైన రైతులకు రాయితీ ఇస్తున్నారు. ఎక్కువ మంది రైతులు అరటిపంట, పత్తిపంటలు సాగుచేస్తున్నారు. ఏడాది కేడాదికి పామాయిల్ పంట సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఉద్యాన శాఖ అధికారులంతా సేవలందిస్తున్నందున సాగు విస్తీర్ణం పెరిగింది.

– ప్రత్యూష్, ఉద్యానశాఖ అధికారి.

శిథిలావస్థలో పాఠశాల

పాచిపెంట: మండలంలోని కర్రి వలస పంచాయతీ గుమ్మడిగుడ్డివలస జీపీఎస్ భవనం పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తి కాకముందే శిథిలావస్థకు చేరుకుంది. గతంలో సర్వశిక్ష అభియాన్ నిధుల నుంచి పాఠశాల భవన నిర్మాణం చేపట్టారు. భవనం పనులు పూర్తి చేయకుండా శ్లాబ్ వేసి అలా వదిలేశారు. కనీసం ప్లాస్టింగులు, గచ్చులు కూడా చేయలేదు. తప్పని పరిస్థితుల్లోనే మట్టిలో విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారు. చేసిన పనుల్లో కూడా నాణ్యత లేకపోవడంతో భవనం శిథిలావస్థకు చేరుకుంది. మరో గత్యంతరం లేక శిథిలావస్థకు చేరిన భవనంలోనే ఉపాధ్యాయులు బిక్కుబిక్కుమనుకుంటూ విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు. దీనికి తోడు పాఠశాల ప్రహరీ గేటు కూడా ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. సక్రమంగా గేటు అమర్చకుండా, ఐరన్ తివ్వలతో అలా కట్టేశారు. కట్టిన ఐరన్ తివ్వలు కూడా పింపిరి పట్టి తెగిపోయే స్థితిలో ఉన్నాయి. దీంతో గేటు ఓవైపు వాలిపోయి ప్రమాదకరంగా కనిపిస్తోంది. గేటు దగ్గర్లోనే విద్యార్థులు ఆడుకుంటున్నారు. అధికారులు స్పందించి గేటు అక్కడి నుంచి తొలగించడం కానీ, లేక సక్రమంగా అమర్చడం గాని చేయకపోతే ఏ క్షణమైనా ప్రమాదం జరిగే ఆస్కారం లేకపోలేదని పిల్లల తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.



శిథిలావస్థలో ఉన్న గుమ్మిడి గుడ్డి వలస పాఠశాల భవనం



ప్రమాదకరంగా ఉన్న గేట్ సమీపంలో ఆడుకుంటున్న పిల్లలు

భగవంతుడిపై నమ్మకంతో జీవించాలి

పాలకొండ: ప్రతి ఒక్కరూ భగవంతుడిపై నమ్మకంతో జీవించాలని సత్యసాయి ప్రతినిధి ఎస్‌వీ రమణ అన్నారు. పట్టణంలోని నాగవంశపు వీధిలోని రామమందిరంలో దివ్యజ్ఞాన సత్సంగ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. మనశ్శాంతి పొందాలంటే దైవానుగ్రహం పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్తలు డి. యోగీశ్వరరావు, ఎం.మోహనదాస్, ఎస్.మల్లేశ్వరరావు, జడ్డు జగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.



సత్సంగ సమావేశంలో ప్రసంగిస్తున్న వక్త

అంగన్వాడీ కేంద్రమంటూ అపహాస్యం

● ఏడు నెలలుగా ప్రారంభానికి నోచుకోని కంటైనర్
● ఏర్పాటులోనే సర్వత్రా విమర్శలు

పార్వతీపురం రూరల్: కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి ఎలా అటకెక్కిందో, అధికారుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో తిష్టవేసిందో చెప్పడానికి పార్వతీపురం మండలంలోని నర్సిపురం గ్రామంలో రహదారి పక్కన నిరుపయోగంగా పడి ఉన్న ఈ అంగన్వాడీ కేంద్రం కంటైనరే సజీవ సాక్ష్యం. అద్దెభవనాల్లో కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రాలకు నూతన పక్కా భవనాలు నిర్మించాల్సిందిపోయి ఆర్భాటమే ప్రధానంగా ఆచరణ శూన్యంగా నర్సిపురం గ్రామంలో రెండవ అంగన్వాడీ కేంద్రం నిర్వహణ కోసం అధికారులు ఆర్భాటంగా ఓ కంటైనర్‌ను తెప్పించారు. చిన్నారులకు అన్ని వసతులతో కూడిన విద్య అందుతుందని ఊదరగొట్టారు. అయితే ఏడు నెలలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోని ఆ కంటైనర్ అధికారుల నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతోంది. అంతర్‌రాష్ట్ర రహదారి పక్కనే ఏర్పాటు చేసిన ఈ కంటైనర్‌ను చూసి స్థానికులు ముక్కున వేలేసుకున్నారు. పక్కా భవనం నిర్మించాల్సిందిపోయి ఈ కంటైనర్‌లో ఏర్పాటు ఏంటంటూ తీవ్ర విమర్శలు వెల్లువెత్తినా అధికారుల చెవికి మాత్రం ఎక్కడం లేదు.

పట్టించుకోని యంత్రాంగం

నిర్మాణానికి వీలుకాని కొండకోన ప్రాంతాల్లో ఏర్పాటు చేయాల్సిన కంటైనర్లను ఇలా జనవాసాల మధ్య అది కూడా అంతర్‌రాష్ట్ర రహదారిని ఆనుకుని పెట్టడమేమిటని, ఆడుకునే చిన్నారులు ఆదమరిచి ప్రమాదాల బారిన పడితే ఎవరు బాధ్యులు? ఎండకు వేడెక్కితే ఈ కంటైనర్‌లో పసిపిల్లలు ఎలా అవస్థలు పడతారో ఆలోచించరా? అంటూ కంటైనర్ ఏర్పాటులోనే గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి ఆవేదన అరణ్య రోదనగానే మిగిలిపోయింది. ప్రస్తుతం ఈ కంటైనర్ వినియోగానికి నోచుకోక పెట్టిన ప్రజాధనం వృథా అయి పగలు పశువులకు, రాత్రిళ్లు చిల్లర మనుషులు చేసే అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. ప్రజాధనాన్ని ఇలా వృథా చేయడం సరికాదని పలువురు అభిప్రాయపడుతున్నారు.



నర్సిపురంలో అంతర్‌రాష్ట్ర రహదారిని ఆనుకుని ఏడు నెలల క్రితం అంగన్వాడీ కేంద్రం నిర్వహణ నిమిత్తం ఏర్పాటు చేసిన కంటైనర్



అసాంఘిక కార్యకలాపాలతో, చెత్తాచెదారంతో ఉన్న కంటైనర్ ప్రాంగణం